నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, బుధవారం 3 ఏప్రిల్ 2024 | YADADRI BHUVANAGIRI

కోరం లేక జడ్పీ స్థాయీ సంఘం సమావేశాలు వాయిదా

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 2 : జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశాలు కోరం లేక వాయిదా వేస్తున్నట్లు జడ్పీ సీఈఓ శోభారాణి ప్రకటించారు. సమావేశాలకు హాజరైన జిల్లా స్థాయి అధికారులు ఆయా శాఖల పరిధిలోని ప్రగతి నివేదికలను సమర్పించాలని, తదుపరి నిర్వహించే సమావేశాలకు సంబంధించిన తేదీని తెలియజేస్తాని తెలిపారు. సమావేశంలో పలువురు సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశాలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న జడ్పీ సీఈఓ శోభారాణి

నేడు బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం

- హాజరుకానున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 2 : బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థుల గెలుపు కోసం రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంట్ నియోజకవర్గ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం భువనగిరి పట్టణ పరిధిలోని శ్రీ సాయి కన్వెన్షన్ హాల్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు చేపట్టనున్నారు. దీనికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితోపాటు బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశం, జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, పట్టణ, మండల కమిటీల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

డేగ కండ్ల నిఘా

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసుల ప్రణాళిక

- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- 24 గంటలూ తనిఖీలు
- పార్లమెంట్ పరిధిలో 23 చెక్‌పోస్ట్‌ల ఏర్పాటు
- డబ్బు, మద్యం అక్రమ రవాణా కట్టడికి చర్యలు
- సోషల్ మీడియా ఖాతాలపై స్పెషల్ ఫోకస్
- రౌడీషీటర్ల బైండోవర్
- ఆయుధాల స్వాధీనం

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు వీలుగా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నది. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా, ఎలాంటి అవాంతరాలూ కలుగకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. మద్యం, డబ్బు, ఇతరత్రా తాయిలాలు రవాణా జరగకుండా నిరోధించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సరిహద్దుల్లో చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. సోషల్ మీడియా ఖాతాల పైనా నజర్ పెట్టారు. జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు 2,141 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణలో భద్రత అత్యంత కీలకం కాగా, షెడ్యూల్ జారీ అయిన రోజునే పోలీసులు రంగ ప్రవేశం చేశారు. నోటిఫికేషన్‌కు ముందు, తర్వాత తీసుకోవాల్సి చర్యలపై ప్లాన్ రూపొందించారు. ప్రచార శైలి, అనుమతులు, రాజకీయ పార్టీలపై నిఘా పెట్టారు. మారుతున్న పరిస్థితుల దృష్ట్యా సాంకేతికకు ప్రాధాన్యం ఇస్తున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోకి ప్రవేశించే ప్రధాన మార్గాలపై పికెట్‌లు ఏర్పాటు చేశారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో 23 చెక్‌పోస్ట్‌లు, జిల్లా పరిధిలో తొమ్మిది చెక్ పోస్టుల ద్వారా పూర్తి నిఘా పెట్టారు. వాహనాలను నిశితంగా తనిఖీ చేస్తున్నారు. 50వేల రూపాయలకు మించి డబ్బులు కలిగిన వారి నుంచి నగదును స్వాధీనం చేసుకుంటున్నారు. అనుమానస్పద స్థితిలో కనిపించిన వారిని ప్రశ్నిస్తున్నారు. మద్యం, డబ్బు అక్రమ రవాణా జరగకుండా పటిష్ట నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. 24గంటలపాటు తనిఖీలు చేయడానికి సిబ్బందిని షిఫ్టుల వారీగా నియమించారు. ఎన్నికల నేపథ్యంలో ముందస్తు అనుమతి తీసుకోకుండా సభలు, సమావేశాలు నిర్వహించొద్దని అధికారులు సూచించారు.

రూ. 50వేలకు మించితే సీజ్..

ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి డబ్బు తరలిస్తే సీజ్ చేస్తున్నారు. సాధారణ వ్యక్తులు, వ్యాపార నిమిత్తం, ఆస్పత్రి అవసరాలు, వివాహాల షాపింగ్ ఇతర ఖర్చులకు నగదు తీసుకెళ్లాల్సి వస్తే ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో తెలిపే పత్రాలు చూపాల్సి ఉటుంది. బ్యాంక్ నుంచి విత్ డ్రా చేసిన రశీదు, ఏటీఎం నుంచి ఉపసంహరించుకున్న స్లిప్‌లను అధికారులకు చూపించాల్సి ఉంటుంది. బంగారం తరలించినా దానికి సంబంధించి ఆధారాలు ఉండాలి. ఎలాంటి పత్రాలు, ఆధారాలూ లేకుంటే పోలీసులు సీజ్ చేసే అవకాశం ఉంది.

బైండోవర్లు.. ఆయుధాల స్వాధీనం

యాదాద్రి జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఉన్న సిబ్బంది సేవలకు వినియోగించుకుంటున్నారు. అదనంగా సాయుధ బలగాలు, కేంద్ర బలగాలను మోహరించారు. పోలీసులతోపాటు రెవెన్యూ, పంచాయతీ, రవాణా, ఆబ్కారీ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో 23ఫ్లయింగ్ స్క్వాడ్లు, 23 స్టాటిస్టికల్ సర్వేయల్ టీమ్‌లు, 9 వీడియో వీవింగ్ టీమ్‌లు క్షేత్రస్థాయిలో పని చేస్తున్నాయి. జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలనూ గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా నజర్ పెట్టారు. ఎన్నికల కమిషన్ నియామవళిని అనుసరించి ఆయుధాల లైసెన్స్ కలిగిన ఉన్న వారి నుంచి తుపాకీలను తిరిగి స్వాధీనం చేసుకుంటున్నారు. రౌడీషీటర్లను బైండోవర్ చేస్తున్నారు. పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. సంఘ విద్రోహ శక్తులపై నిఘా పెంచారు. ఏమైనా సమస్యలు ఉంటే 1950 నంబర్‌తోపాటు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

సోషల్ మీడియాపైనా ఫోకస్..

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ (ట్విటర్), యూట్యూబ్, వాట్సాప్.. ప్రస్తుత కాలంలో వీటి పేర్లు తెలియని వాళ్లు లేరు. కొంతమంది రెండు, మూడు అకౌంట్లు కూడా ఉపయోగిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు సోషల్ మీడియాతోనే కాలం గడుపుతున్నారు. సరిగ్గా రాజకీయ నాయకులు వీటిని క్యాష్ చేసుకుంటున్నారు. అభ్యర్థులంతా ప్రత్యేకంగా సామాజిక మాధ్యమ విభాగాలను ఏర్పాటు చేసుకున్నారు. వ్యక్తిగత, పార్టీ ప్రచారాలకు ఎలాంటి ఆంక్షల్లేనప్పటికీ ఇతర పార్టీలను తిట్టడం, దూషించడం, అసభ్యకరమైన, మత విశ్వాసాలు దెబ్బతినేలా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోస్టులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోనున్నారు. అభ్యర్థులు కోడ్ నిబంధనలను అతిక్రమిస్తే అఫిడవిట్‌ను రద్దు చేయడంతోపాటు ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసే అవకాశం ఉంది.

5 కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ హనుమంతు జెండగే, యువత

ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలి

- కలెక్టర్ హనుమంతు జెండగే
- భువనగిరిలో ఉత్సాహంగా 5కే రన్

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 2 : మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతతో ఓటు వేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే ప్రజలను కోరారు. స్వీప్ ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు చేపట్టిన 5కే రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. యువతీ,యువకులు, విద్యార్థులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరుగడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. భువనగిరి పార్లమెంట్ ఎన్నికలకు ఏప్రిల్ 18న నోటిఫికేషన్, మే 13న పోలింగ్, జూన్ 4న ఫలితాలు వెల్లడవుతాయని తెలిపారు. జిల్లాలో గత అసెంబ్లీ ఎన్నికల్లో 90 శాతం పైగా ఓటింగ్ జరిగిందని, పార్లమెంట్ ఎన్నికల్లోనూ అదే మాదిరిగా వచ్చేందుకు సహకరించాలని కోరారు. పోలింగ్ కేంద్రాల్లో మహిళలు, దివ్యాంగులు, సీనియర్ సిటిజెన్స్ ప్రత్యేకమైన ఓటింగ్ ఏర్పాట్లు ఉంటాయని చెప్పారు. 85 సంవత్సరాలు పైబడిన వారికి, దివ్యాంగులకు హోమ్ ఓటింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని, ఓటు హక్కు లేని వారు ఫారం -6 ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. సి-విజిల్ యాప్ ద్వారా ఎన్నికల నిబంధనల అతిక్రమణ పట్ల వచ్చే ఫిర్యాదులను 90 నిమిషాల్లో పరిష్కరిస్తారని, 1950 టోల్ ఫ్రీ నంబరు ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ ఓటు ప్రాధాన్యం, నైతిక ఓటింగ్ పట్ల అవగాహన కోసం 5 కే రన్ ప్రారంభించామని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఎన్నికల ప్రాధాన్యాన్ని నిలబెడుతామని, ప్రతి ఒక్కరం ఓటింగులో పాల్గొంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి ఎంఏ క్రిష్ణన్, జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలింగ్ విధులను పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

పూర్తి అవగాహనతో పోలింగ్ విధులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. భువనగిరి పట్టణంలోని వెన్నెల కాలేజీలో మంగళవారం భువనగిరి, ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పీఓ, ఏపీఓలకు పోలింగ్ విధానం, ఈవీఎం యంత్రాల పనితీరుపై జరిగిన రెండో రోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలకు సంబంధించిన పూర్తి మెటీరియల్‌ను అందించామని, ఎన్నికల విధులు, ఈవీఎం యంత్రాల పట్ల పూర్తి అవగాహన పొందాలన్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్ హ్యాండ్ బుక్‌లోని సూచనల ప్రకారం అన్ని పత్రాలను సీల్ చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, కలెక్టరేట్ ఏఓ జగన్మోహన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

పర్యాటకులను ఆకర్షించేలా బుద్ధవనం అభివృద్ధి

- టూరిజం ఎండీ రమేశ్ నాయుడు

నందికొండ, ఏప్రిల్ 2 : దేశ, విదేశ పర్యాటకులను ఆకర్షించేలా బుద్ధవనాన్ని అభివృద్ధి చేస్తామని టూరిజం ఎండీ రమేశ్‌నాయుడు అన్నారు. నందికొండ హిల్‌కాలనీలో బుద్ధవనాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. బుద్ధుడి పాదాలకు పుష్పాంజలి ఘటించి జాతకపార్కు, అవకాన బుద్ధ, మహాస్తూపం, ధ్యాన మందిరం, వ్యూ పాయింట్‌లను పరిశీలించారు. బుద్ధవనంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధవనంలో రూ.15 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్, సోలార్ సిస్టమ్, వాటర్ ట్యాంక్‌ల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. నూతనంగా స్వదేశీ దర్శన్ పథకంలో చాలెంజ్‌డ్ బేసిడ్ డిస్టినేషన్ డెవలప్‌మెంట్‌లో భాగంగా రూ.25 కోట్లతో డిజిటలైజేషన్ మ్యూజియం నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. అనంతరం విజయవిహార్, బోటింగ్ పాయింట్‌లను పరిశీలించి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయనతోపాటు టూరిజం జీఎం ఉపేందర్‌రెడ్డి, బుద్ధవనం ఓఎస్‌డీ సుధాన్‌రెడ్డి, బుద్ధనం కన్సెల్టెంట్, పురావస్తు నిపుణుడు ఈమని శివనాగిరెడ్డి, సహాయక శిల్పి శ్యామ్ సుందర్, ఏఈ నజీమ్ ఉన్నారు.

బుద్ధవనంలోని మహాస్థూపం వద్ద పర్యాటక శాఖ ఎండీ రమేశ్‌నాయుడు

బీఈడీ, బీపీఈడీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

రామగిరి, ఏప్రిల్ 2 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ కళాశాలల విద్యార్థులకు ప్రథమ సంవత్సరం సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆయా పరీక్ష కేంద్రాల్లో సజావుగా పరీక్షలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. నల్లగొండలోని డాన్‌బాస్కో బీఈడీ కళాశాలలో పరీక్షలను ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, అసిస్టెంట్ కంట్రోలర్ లక్ష్మీప్రభ పరిశీలించారు. వారి వెంట ఆ పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ దొడ్డ ఎలియా, స్క్వాడ్స్ ఉన్నారు.

జిజ్ఞాసకు ఎన్‌జీ కాలేజ్ నుంచి ఐదు ప్రాజెక్టులు ఎంపిక

రామగిరి, ఏప్రిల్ 2 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్యా శాఖ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'జిజ్ఞాస'కు నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల నుంచి ఐదు ప్రాజెక్టులు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికై ప్రాజెక్టుల్లో.. 1. కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్‌లో.. 'ఆహార పరిమాణ వినియోగం ఆటోమేషన్-ఆహార వ్యర్థానికి రియల్ టైమ్ సొల్యూషన్' 2. జంతు శాస్త్రంలో.. 'యుక్త వయసులో బాలికల ఆరోగ్యం' 3.భౌతిక శాస్త్రంలో.. 'రెయిన్ గార్డ్ ఆటోమేటెడ్ పుడ్ గ్రెయిన్ ప్రొటెక్షన్ సిస్టమ్' 4. తెలుగులో.. 'నల్లగొండ జిల్లా గ్రామ నామాలు పరిశీలన' 5. చరిత్రలో 'ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గడీల వ్యవస్థ' ఉన్నాయని పేర్కొన్నారు. ప్రాజెక్టుల పరిశోధన పర్యవేక్షకులుగా కళాశాల అధ్యాపకులు తండు కృష్ణకౌండిన్య, ఎండీ తౌసీఫ్ ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో వీటిని ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.

నేటి నుంచి 'పది' మూల్యాంకనం

రామగిరి, ఏప్రిల్ 2: పదో తరగతి వార్షిక పరీక్షల స్పాట్ వాల్యుయేషన్ బుధవారం నుంచి ప్రారంభంకానున్నది. నల్లగొండ జిల్లాకు సంబంధించి జిల్లా కేంద్రంలోని శాంతినగర్ లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో క్యాంపు ఏర్పాటు చేశారు. ఆరు సబ్జెక్టులకు సంబంధించి స్పాట్ వాల్యుయేషన్ క్యాంపునకు రెండు లక్షలకుపైగా జవాబు పత్రాలు వచ్చినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. స్పాట్ వాల్యుయేషన్ ఉత్తర్వులు పొందిన ఉపాధ్యాయులు బుధవారం ఉదయం 9గంటలకు క్యాంపులో రిపోర్టు చేయాలని డీఈఓ భిక్షపతి తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ తరుణ్‌జోషి

- ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- రాచకొండ సీపీ తరుణ్ జోషి

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 2 : నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు, రాచకొండ సీపీ తరుణ్ జోషి తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం యాదాద్రి జోన్ డీసీపీ, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, అధికారులతో నిర్వహించిన క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడారు. యాదాద్రి జోన్ పరిధిలో జరిగే నేరాలను అదుపులో ఉంచాలని, నేర నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే బాధితులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, వారి బాధలను ఓపికగా విని తగిన న్యాయం చేయాలని సూచించారు. ఎన్నికల విధులను అధికారులు, సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని, చట్టాలు, సెక్షన్ల మీద సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉండాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే కిందిస్థాయి సిబ్బందికి సైతం ఎన్నికలకు సంబంధించి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. యాదాద్రి జోన్ పరిధిలో ఎనిమిది స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్ ఏర్పాటు చేశామని, అక్రమంగా తరలిస్తున్న డబ్బు, మద్యం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ఇతర నిషేధిత వస్తువులను పట్టుకోవడానికి మరిన్ని చెక్ పోస్టులు పెట్టాలని చెప్పారు. ఆయా స్టేషన్ల సిబ్బంది పని తీరు తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు.

వివిధ స్టేషన్లలో నమోదైన పోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పెండింగ్ గ్రేవ్ కేసుల విచారణ, ఇతర కేసుల విచారణ, పురోగతిపై సమీక్షించారు. వృద్ధులు, మహిళలపై నేరాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అలాంటి వారి ఫిర్యాదులకు తక్షణమే స్పందించి న్యాయం చేకూర్చాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీపీ రాజేశ్‌చంద్ర, అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అధికారికి వినతి అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రైతులను అన్ని విధాలా ఆదుకోవాలి

- ధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ చెల్లించాలి
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేత

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 2 : నీళ్లు లేక పంట ఎండిన రైతులను ఆదుకోవాలని, యాసంగి ధాన్యానికి మద్దతు ధరతోపాటు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు రైతు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతుకు మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్‌ను ఈ పంట నుంచే ఇవ్వాలన్నారు. నీళ్లు అందక ఎండిపోయిన పంటకు ఎకరానికి 25 వేల రూపాయలను నష్టపరిహారంగా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు కొలుపుల అమరేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, జడ్పీటీసీ సుబ్బూరు బీరు మల్లయ్య, బీఆర్ఎస్ పట్టణ, మండలాధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, నాయకులు భూపాల్‌రెడ్డి, చింతల కిష్టయ్య, నరేందర్‌రెడ్డి, జనగాం పాండు, ఎడ్ల సత్తిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, తుమ్మల వెంకట్‌రెడ్డి, రాచమల్ల శ్రీనివాస్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, ఓం ప్రకాశ్‌గౌడ్, కేశవపట్నం రమేశ్, కంచి మల్లయ్య, సుభాశ్, శివ, నాగు, సూరజ్, వెంకట్‌చారి పాల్గొన్నారు.